- రేవంత్ సర్కారు నిర్లక్ష్యంతో గ్రామీణ పేదలకు 'నీటి' కష్టాలు
- మిషన్ భగీరథ పథకంపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం
- గత సర్కారు నిర్మించిన ట్యాంకులు, వేసిన పైపులపై కర్కషం
- వాటిని పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో తాగునీటి తిప్పలు
- తాగునీటి కోసం పల్లె ప్రజలు తల్లడిల్లుతున్నా కక్షసాధింపు ధోరణి
- 'భగీరథ'తో కేసీఆర్ పేరు చిరస్థాయిగా నిలుస్తుందన్న భయం
- అందుకే ప్రజల గొంతులెండుతున్నా పట్టించుకోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం
- చుంచుపల్లి, చర్ల మండలాల్లో తీవ్రస్థాయిలో తాగునీటి ఎద్దడి
- 'చర్ల'లో చెరువులు అడుగంటడంతో ఎండుతున్న మిర్చి, వరి పంటలు

అపర భగీరథుడైన కేసీఆర్‌పై కక్షగట్టిన కాంగ్రెస్ సర్కారు.. ఆయన ముద్రను తెలంగాణ సమాజం నుంచి చెరిపేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు స్పష్టంగా కన్పిస్తోంది. పూర్తిగా రాజకీయ కక్షసాధింపు ధోరణి అవలంబిస్తున్నట్లు అనేక విషయాల్లో స్పష్టమవుతోంది. ఈ క్రమంలో దాహార్తి కోసం ప్రజలు అల్లాడుతున్నా దయలేకుండా వ్యవహరిస్తోంది. ఇందుకు మిషన్ భగీరథ పథకం ప్రత్యక్ష సాక్ష్యంగా కన్పిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలోని ఇంటింటికీ శుద్ధజలాలు అందించాలని సంకల్పించిన గత ముఖ్యమంత్రి కేసీఆర్.. తన పాలనలో 'మిషన్ భగీరథ'కు శ్రీకారం చుట్టారు. అన్ని గ్రామాల్లోనూ వాటర్ ట్యాంకులు నిర్మించారు. ఇంటింటికీ పైపులైన్లు వేశారు. ఆయన పాలనలో అన్ని గ్రామాలకూ తాగునీటిని సజావుగా అందించారు. అయితే, ఆయన పదేళ్ల పాలన పూర్తయ్యే రోజుల నాటికి మరికొన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ ట్యాంకుల నిర్మాణాలు, పైపులైన్లు, ట్యాంపుల ఏర్పాట్లు చివరి దశలో ఉన్నాయి. ఆయన మరోసారి ముఖ్యమంత్రి అయి ఉంటే ఆ గ్రామాల్లోనూ భగీరథ పనులు పూర్తయ్యేవి. ప్రతి ఇంటికీ నూరు శాతం శుద్ధజలాలు అందేవి. కానీ.. మోసపు హామీలతో 16 నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజోపయోగ పథకాలను పక్కనబెట్టింది. కేవలం కేసీఆర్ పొడగిట్టని కారణంగా.. ఆయన తెచ్చిన అద్భుత పథకాలను నీరుగారుస్తోంది. తాజాగా మిషన్ భగీరథను కూడా ఆ జాబితాలో చేర్చింది. కేవలం భగీరథ ఉద్దేశాన్ని భగ్నం చేసేందుకే కాచుకొని కూర్చుంది. ఈ క్రమంలో తాగునీళ్లందక ప్రజల గొంతెండుతున్నా పట్టించుకున్న పాపానపోవడం లేదు. ఈ కథనంలోని రెండు మండలాలను పరిశీలిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు ఎంత తీవ్రస్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది. –చుంచుపల్లి/ చర్ల, ఏప్రిల్ 2



ట్యాంకరుతో వరి పంటను తడుపుతున్న రైతు

### పంట చేతికొస్తుందన్న ఆశ లేదు..



మా ఊరి పెద్ద చెరువును నమ్ముకొని ఆరు ఎకరాల్లో యాసంగి వరి పంట వేశాను. ఇప్పుడు చెరువులో నీరు అడుగంటింది. పంట కంకితీసే సమయానికి సాగునీరు అందడం లేదు. పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా తడులు పెడుతున్నాను. కొంతైనా పంట చేతికి వస్తుందనే ఆశతోనే శ్రమిస్తున్నాను. కానీ.. పంట చేతికొస్తుందన్న నమ్మకమైతే లేదు.

–గోసంగి రమేశ్, చర్ల

# గొంతెండుతున్న పల్లెలు..
# నెర్రెలు వారుతున్న పొలాలు

## భగీరథ ట్యాంకు ఉంది.. నీళ్లు మాత్రం ఇవ్వట్లేదు..

భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండలాన్ని పరిశీలిస్తే.. భగీరథ పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంత చిన్నచూపు ఉందో అర్థమవుతోంది. ఈ మండలంలోని నందాతండాలో గత కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ వాటర్ ట్యాంకును నిర్మించింది. వీధివీధికీ పైపులైన్లు వేసింది. ప్రతి ఇంట్లోనూ నల్లాలు బిగించింది. వాటికి కనెక్షన్లు ఇచ్చే సమయానికి కేసీఆర్ ప్రభుత్వం మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. సరిగ్గా అప్పటి నుంచే ఈ గ్రామ ప్రజలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. నిర్మించి సిద్ధంగా ఉన్న మిషన్ భగీరథ ట్యాంకును మూలనపడేసింది. నల్లాల కనెక్షన్లను నట్టేట ముంచింది. దీంతో గత కేసీఆర్ ప్రభుత్వం నోటి కాడి దాకా తెచ్చిన తాగునీటిని కాంగ్రెస్ ప్రభుత్వం కాలదన్నినట్లయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భగీరథ ట్యాంకు నిండా నీళ్లు నింపిన అధికారులు.. ఇళ్లకు మాత్రం సరఫరా చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై మిషన్ భగీరథ ఏఈ వసంత కుమారిని వివరణ కోరగా.. పైపులైన్లను గతంలోనే వేశామని, ట్యాంకులో నీటిని కూడా నింపామని అన్నారు. అయితే, ఇళ్లలోని నల్లాలతో వాటికి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందని అన్నారు. దీనికి రెండు మూడు రోజుల సమయం పడుతుందని, త్వరలోనే నందా తండా గ్రామస్తులకు తాగునీటిని సరఫరా చేస్తామని సమాధానమిచ్చారు.



చుంచుపల్లి: నిర్మాణం పూర్తి అయిన మిషన్ భగీరథ ట్యాంకు

### భగీరథ నీరు రావడం లేదు..



మా కాలనీకి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. ఇంటింటికీ శుద్ధ జలాలు ఇచ్చేందుకు గత ప్రభుత్వంలో పైపులైన్లు వేశారు. వాటర్ ట్యాంకును కూడా నిర్మించారు. కానీ.. నీటిని మాత్రం సరఫరా చేయడం లేదు. దీంతో అన్నీ సిద్ధంగా ఉన్నప్పటికీ బోరు నీళ్లు తాగక తప్పడం లేదు. మిషన్ భగీరథ ద్వారా శుద్ధి చేసిన నీటిని ఇవ్వాలని వేడుకుంటున్నా ప్రభుత్వం నుంచి స్పందన ఉండడం లేదు.

–జగ్గమ్మ, గృహిణి, హౌసింగ్ బోర్డు కాలనీ

### బోరు నీళ్లను తాగలేకపోతున్నాం..



మా గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు సరఫరా కావడం లేదు. దీంతో బోరు నీటినే తాగుతున్నాం. మిషన్ భగీరథ నీళ్లయితే శుద్ధి చేశాక వస్తాయి కాబట్టి నిర్భయంగా తాగొచ్చు. కానీ.. బోరు నీళ్లలో గ్యారెంటీ ఉండదు కదా. పైగా మా గ్రామంలో భగీరథ ట్యాంకు నిర్మించి కూడా నీటిని సరఫరా చేయడం లేదు. అయితే, కరెంటు నిరంతరం ఉండని కారణంగా బోరు నీళ్లు కూడా సక్రమంగా రావడం లేదు.

–మూడ్ జయరాంనాయక్, నందాతండా

## గోదారి ఒడ్డునున్నా గొంతెండుతోంది..



మరమ్మతుకు నోచుకోని కొత్తపల్లి చేతిపంపు

చర్ల మండల ప్రజలదీ మరింత దయనీయ పరిస్థితి. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గోదావరి ఒడ్డున ఉన్న గ్రామాల ప్రజలకు కూడా గొంతెండుతున్న స్థితి. ఈ మండలంలోని కొత్తపల్లి గ్రామం గోదావరి నది ఒడ్డునే ఉంటుంది. అయినప్పటికీ బోర్లలో నీళ్లు అడుగంటాయి. అందుకు ప్రత్యామ్నాయంగా మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు తీసుకున్న పాపానపోవడం లేదు. భగీరథ ద్వారా కేవలం అంతంతమాత్రంగానే తాగునీటిని సరఫరా చేస్తూ చేతులు దులుపుకుంటోంది. కనీసం మూలనపడ్డ బోర్లకు మరమ్మతులు కూడా చేయించడం లేదు. అయితే, తమకు తాగునీరు అందించాలని కోరుతూ ఆర్.కొత్తగూడెం, కలివేరు గ్రామాల ప్రజలు ఇటీవల రోడ్డెక్కి ఆందోళనలు చేసినా అది అరణ్య రోదనగానే మిగిలిపోయింది. ఇక పంటలకు సాగునీళ్లు అందించే అంశంలోనూ అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. అన్నదాతలు సాగు చేస్తున్న మిర్చి, వరి పంటలు ఎండిపోతున్నా సర్కారు నుంచి స్పందన ఉండడం లేదు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తమ పంటలు కాపాడుకునేందుకు అనేక తంటాలు పడుతున్నారు. కొందరు రైతులైతే ట్యాంకర్లతో నీటిని తెచ్చి పొలాలకు పెట్టుకుంటున్నారు. అంత ఖర్చు భరించలేని రైతులు.. ఎండిపోతున్న పంటలను చూసి తల్లడిల్లిపోతున్నారు. లింగాపురంపాడు, పాత చర్ల పెద్ద చెరువులు అడుగంటడంతో దిక్కుతోచని స్థితిలో ఆశలు వదులుకుంటున్నారు.

### బోరు మరమ్మతులకు గురై ఆరు నెలలైంది.



మా ఊరిలో బోరు మరమ్మతులకు గురై ఆరు నెలలు దాటిపోయింది. తమ గ్రామంలో తాగునీటి సమస్యను అధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. కానీ.. సర్కారు నుంచి స్పందన రాలేదు. ఇప్పటివరకు బోరును బాగుచేయించలేదు. భగీరథ నీటిని అంతంతమాత్రంగానే అందిస్తున్నారు. గోదావరి ఒడ్డున ఉన్నా తాగునీటికి తిప్పలు తప్పడం లేదు.

–బట్టా వెంకటలక్ష్మి, కొత్తపల్లి

### మిర్చితోట ఎండింది..



మా ఊరి చెరువు కింద మూడెకరాల్లో మిర్చి సాగు చేశా. ఈ ఏడాది చెరువు అడుగంటింది. చెరువు నీరు రాకపోవడంతో పంట ఎండిపోతోంది. ఎకరానికి రూ.లక్షన్నర వరకూ ఖర్చుచేశాను. ఇప్పుడు నీరు అందకపోవడంతో చేసేదీమీలేక పంటను వదిలేశాను. మా ఊరి రైతులం యాసంగిలో ఈ చెరువు కింద 60 ఎకరాల్లో మిర్చి, 20 ఎకరాల్లో వరి సాగుచేశాం. అందరి పంటలూ ఎండిపోతున్నాయి.

–బైరి సుధాకర్, లింగాపురంపాడు

## 'నవమి'కి పకడ్బందీ ఏర్పాట్లు

- మిథిలా స్టేడియంలో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు
- శ్రీరామనవమి సమీక్షలో దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్

భద్రాచలం, ఏప్రిల్ 2 : శ్రీరామ నవమి, మహా పట్టాభిషేకం మహోత్సవాలకు భద్రాచలం తరలివచ్చే భక్తుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ తెలిపారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవ వేడుకల ఏర్పాట్లపై బుధవారం ఆయన శాఖలవారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 6, 7వ తేదీల్లో స్వామివారి కల్యాణం, పట్టాభిషేకం కార్యక్రమాలకు వచ్చే భక్తుల కోసం మిథిలా స్టేడియంలో ప్రతీ సెక్టార్‌లో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కల్యాణ వేడుకలు వీక్షించేందుకు 26 సెక్టార్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు స్వామివారి కల్యాణ వేడుకలు వీక్షించి జన్మజన్మల పుణ్యఫలం పొందేలా అధికారులు కృషి చేయాలన్నారు. కలెక్టర్ జితేశ్ వి పాటిల్ మాట్లాడుతూ లడ్డూ ప్రసాదంతోపాటు మహా ప్రసాదం అందించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. సీఎం రాక కోసం మూడు హెలిపాడ్‌లను సిద్ధం చేస్తున్నామని, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యారోగ్య శాఖ ద్వారా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశామని, లైఫ్ జాకెట్లు, 20 మంది గజ ఈతగాళ్లు, రిస్క్ బోట్లు సిద్ధంగా ఉంచామన్నారు. భద్రాచలం, పర్ణశాలల్లో హెలిపాడ్‌లు, ఏరియా వైద్యశాలలో 24 గంటలు పని చేసే అంబులెన్సుతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, ఆర్డీవో దామోదరరావు, దేవస్థానం ఈవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల లెక్క పక్కాగా ఉండాలి

ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య



ఎరువుల నిల్వలపై మార్క్‌ఫెడ్ మేనేజర్ సునీతతో సమీక్షిస్తున్న డీఏవో

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 2: విత్తనాలు, ఎరువులు దుకాణాల్లో క్రయ విక్రయాలు అత్యంత పారదర్శకంగా, పక్కాగా ఉండాలని డీఏవో ధనసరి పుల్లయ్య అన్నారు. డీఏవో బుధవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండల వ్యవసాయాధికారి ఉమా నగేశ్‌తో కలిసి తొలుత తల్లంపాడులోని ఎరువుల షాపును తనిఖీ చేశారు. క్రయవిక్రయాలకు సంబంధించిన రిజిస్టర్లు, స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఓఎస్ యంత్ర సహాయంతోనే ఎరువుల విక్రయాలు చేపట్టాలని ఆదేశించారు. దుకాణాల్లో ధరల సూచికతోపాటు స్టాకు వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. అవకతవకలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి నెల 5వ తేదీలోపు విత్తన విక్రయాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. అనంతరం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మార్క్‌ఫెడ్ కార్యాలయాన్ని డీఏవో సందర్శించారు. ఉమ్మడి జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ సునీతతో సమావేశమయ్యారు. జిల్లాలో ఎరువుల నిల్వలపై ఆరా తీశారు. సొసైటీలకు సరఫరా అవుతున్న ఎరువుల వివరాలు, గోడౌన్‌లో స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

- 14లోపు నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలి
- లబ్ధిదారులకు నాణ్యతలేని సన్నబియ్యం పంపిణీ చేస్తే చర్యలు
- మీడియా, అధికారుల సమావేశంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

## జనాభాకు అనుగుణంగా.. 'యువ వికాసం' యూనిట్లు



మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 2:మండల, గ్రామ జనాభాకు అనుగుణంగా, ప్రభుత్వ లక్ష్యాల మేరకు రాజీవ్ యువ వికాసం యూనిట్లను మంజూరు చేయనున్నట్లు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. అర్హులైన నిరుద్యోగులు ఈ నెల 14లోపు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. యువ వికాసం, సన్నబియ్యం పంపిణీపై కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలోనూ, అనంతరం యువ వికాసం అమలుపై మండల స్థాయి అధికారులతో ఏర్పాటుచేసిన సమీక్షలోనూ ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి పొందేందుకు రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు వివిధ యూనిట్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఎంచుకున్న సెక్టార్లు, వ్యాపారాల వారీగా ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ ఇస్తామన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలు కూడా తప్పనిసరిగా మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే, తెల్ల రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు చౌకదుకాణాల్లో ఉచితంగా సన్న బియ్యం సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. సన్న బియ్యం పక్కదారి పట్టడానికి వీలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. లబ్ధిదారులకు నాణ్యత లేని సన్న బియ్యం అందిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు సన్యాసయ్య, నవీన్‌బాబు, జ్యోతి, విజయలక్ష్మి, పురందర్, శ్రీలత, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌సీయూ భూముల జోలికెళ్లొద్దు..

- వేలం నిలిపివేయాలని సీపీఎం ఆధ్వర్యంలో నిరసనలు
- ఉమ్మడి జిల్లాలో సీఎం రేవంత్, ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం

రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌సీయూ భూముల జోలికి వెళ్లొద్దని, వేలం పాటలు వెంటనే నిలిపివేసి మూగజీవాలను రక్షించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా సీపీఎం, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీలు చేపట్టడంతోపాటు పలు చోట్ల సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. యూనివర్సిటీ విద్యార్థులపై దాడులు చేయడంతోపాటు అక్రమంగా కేసులు బనాయించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టేకులపల్లిలో ఏపీకేఎం, టీపీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. పాల్వంచ, ఎర్రుపాలెం, కారేపల్లి, తిరుమలాయపాలెం, కొణిజర్ల, ఇల్లెందు, జూలూరుపాడు మండలాల్లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ దిష్టిబొమ్మలను, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. తిరుమలాయపాలెంలో ఖమ్మం - వరంగల్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఖమ్మం నగరంలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాల నుంచి ఇల్లెందు క్రాస్ రోడ్డు వరకు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు.

–ఖమ్మం, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/భద్రాద్రి కొత్తగూడెం (నమస్తే తెలంగాణ)



ఎర్రుపాలెంలో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



ఖమ్మంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు



తిరుమలాయపాలెంలో..



కొణిజర్లలో..



ఇల్లెందులో..



జూలూరుపాడులో..

## విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి

భద్రాచలం, ఏప్రిల్ 2: విపత్తులను ఎదుర్కొనేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని రాష్ట్ర అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి అన్నారు. భద్రాచలంలో ఇటీవల కూలిన ఆరు అంతస్తుల భవనాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఘటనా ప్రదేశంలో రెస్క్యూ చేసిన విధానాన్ని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి క్రాంతికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రుల వివరాలు అడిగారు. రెస్క్యూ సిబ్బందిని అభినందించారు. వేసవికాలంలో ఎలాంటి ప్రమాదం వచ్చినా సిబ్బంది అప్రమత్తంగా ఉండి సహాయం అందించాలని సూచించారు. అనంతరం అగ్నిమాపక శాఖ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్, సీఐ బరపాటి రమేష్, భద్రాచలం అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాస్, వినోద్, నవీన్ పాల్గొన్నారు.



భవనం కూలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి

## అన్నపురెడ్డిపల్లిలో ఉపాధి హామీ కూలీల నిరసన

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 2: పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంఘం నాయకులు, ఉపాధిహామీ కూలీలు అన్నపురెడ్డిపల్లిలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వాలు అపరిష్కృతంగా ఉన్న ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సెలవు రోజుల్లో కూలీలతో పని చేయిస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలని, కొలతలతో సంబంధం లేకుండా వేతనం చెల్లించాలని, ఎండల తీవ్రత దృష్ట్యా మధ్యాహ్నం వరకు పని చేయాలనే నిబంధనలు ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జంగిలి వెంకటరత్నం, లక్ష్మి, ముత్యం, భద్రమ్మ, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తూ నిరసన తెలుపుతున్న కూలీలు